


# పెళ్ళాం చిత్తరువు: చిత్తరువు పెళ్ళాం

## - కంటిపూడి జానకి రామచౌదరి

## (1936 జనవరి ఆంధ్రభూమి మాస పత్రిక నుండి)

'ఎందుకట్టాచూస్తారూ.'

'ఎట్టా'

'పటం వైపు'

'చూడకూడదని శెలవా?'

'శెలవుకాదు, శాసనం'

'అన్యాయమైన శాసనాల్ని ఉల్లంఘించడం మా కాంగ్రేసువారి కానవాయే'

'అట్లాంటివారిని బంధించి శిక్షించడం మా ప్రభుత్వం వారి కలవాటే.'

'బంధించినా... శిక్షించినా..'

'మొదట వార్నింగు యిచ్చినా 'లా'కి వ్యతిరిక్తంపర్తిస్తున్నారు. కాబట్టి దేవరవారికి సంవత్సరం విడిఖైదు.'

'దేవివారి బాహుబంధనంలోనేనా.'

'కష్టపడలేరేమో.'

'తప్పుతుందామరీ.'

'ఎట్టా తప్పుతుంది చేసిన పాపం '

'చెబితే పోతుంది.'

'అవునుకదా మరి చెప్పండి వేగం.'

'ఏవిటీ.'

'చేసిన పాపం.'

'ఏవనీ?'

'నా ఆజ్ఞ లేకుండా నా బొమ్మను చూశాననీ'

'ఉహూ అట్టాకానబ్బా.'

'ఎట్టా అబ్బా.'

'నీ ఆజ్ఞ లేకుండా నీ చిత్రాన్ని చూశాను.'

'నీలో అంత చిత్రం ఏవుంది చెప్మా చూడడానికీ.'

'అబ్బా చెప్పండి.'

'అమ్మా చెప్పనండి.'

'ఇదిగో.'

'అదిగో.'

'చెప్పండి మరి,'

'చెప్పను.'

'పాపం సుమండీ.'

'ఫరవానై.. పాపానికీ పుణ్యానికీ ఎంతో ఎడం లేదులే చిన్నగట్టు అడ్డం అంతే.'

'అదే దాటడం కష్టం అబ్బాయికి.'

'నీలాటి అమ్మాయిలకది. మాకసలు దాటవలసిన అవసరమేలేదు. సరదాకి కావలిస్తే దీనిలో వౌహ అడుగు తీసి దానిలో వేసేమంటే సరి.'

'వెనక్కి వౌహనెట్టు నెట్టితేసరీ, నాలోకి రావడానికి అర్హతలేదనీ, తక్షణవే బోల్తా హోగయా.'

'వౌహ తోపు తోస్తేసరీ నీవెవరవ్ చెప్పడానికనీ.'

'బాహుంది మీతో చెప్పేవన్నీ యిట్టాటివే ఒంటిపిల్లి రాకాసి.'

'అలాటివాడే ప్రపంచంలో అందరికన్నా బలవంతుడు సత్యవంతుడు.'

'చలంగారి సావిత్రి మగడేనా యీ సత్యవంతుడంటేనీ.'

'కాదు చౌదరిగారి 'మను' మొగడు. '

'పోదురూ అన్నీ కొంటెమాటలూ.. అదిగో అట్టా చూడవద్దని చెప్పలే.'

'చెప్పలేదన్నానా.'

'మరెందుకు చూస్తారూ.'

'చూస్తున్నాను గనుకా చూడడం సహజంగనుకా.'

'ఉ.. గనుకేగాని ప్రతీ విషయం చూడడం సహజం కాదు.'

'అది నీలాటి ఆడ అమ్మాయిలకి. మాకు ప్రపంచంలోని ప్రతి విషయం చూడ్డం సహజమే. చూడడానికీ అనుభవించడానికీ వీల్లేని విషయం వొహటీలేదు మాకు. చూడడానికే పుట్టాం. అనుభవించడానికే జన్మించాం మేము '

'మంచిపని చేశారు, ఇహ చెప్పండి మరీ.'

'ఇంకా ఏవిటి చెప్పండి.'

'చేసిన పాపం.'

'చెబితె పోతుందన్నానుగా.'

'పోగూడదేవిటి తమకి.'

'ఇంకేవన్నావుందా పోయిందంటే.'

'పుణ్యం వుంటుందన్నానుగా.'

'అది పిరికివాళ్ళకి అన్నానుగా.'

'అక్కడికి తమరు మహావీరులైనట్టు.'

'ఆ పాపాన్ని ప్రేమించేవాళ్ళు వీరులు కారు.'

'గొప్పవీరులే, నాస్తికవీరులు.'

'ఎవరు మీరా?'

'మీరే. మీ...రే తెలిసిందా?'

'అనుకుంటే సరీ, మేం నాస్తిక వీరులం ఎట్టా అవుతాం? ఆనందమయిన శాశ్వతమైన యింత ప్రపంచం వుందనగా, అనుభవించడానికి.'

'అనుభవించండి. నాకెందుకు? అదిగో ఆ బొమ్మవైపు మాత్రం చూడకండి. భయంలేదు మీకెక్కడా.'

'మా యింటా వంటాలేదు '

'దేవుడన్నా, దయ్యమన్నా.'

'నన్ను చూస్తే నాకు భయం ఏవిటీ?'

'నరకం అన్నా.'

'ఇహ బావుంది వరస. నా యింటిలో నాకు భయం ఎందుకో.'

'ఉహూ. అన్నీ మీరే, అంతా మీరే. కావల్సు.'

'అవును అంతా నేనే. అన్నీ నేనే.'

'అంతా మీరై వుయ్యాలూగండి. నాకెందుకు? యిది తర్డు వార్నింగ్. యిహ చూశారంటే నాదానివంక – ఎదుటవున్న నేను చాలనేవిటి?'

'ఆ ఇది శాశ్వత జీవిలా కనపడుతోంది. పది సంవత్సరాలుపోయినా యిది యింకా యిరవై సంవతారాల 'మనే ' నీకూ దీనికీ ఎంత తేడావుందో.'

'వుంది లెండి. దాన్ని చూడవాకండి.'

'తమరెవరూ చెప్పడానికీ. దీనిలో నా జీవం వుంది. నా శ్రమ వుంది. నా జీవితం కలసివుంది.'

'ఆ వుంది.'

'నీ సౌందర్యం వుంది. నీ మెడవంపులున్నాయి. నీ వక్షస్థలం వున్నతం వుంది. నీ లేతకెంపు పెదవుల రాగిమం వుంది.'

'ఆ వుంది కాని దాన్ని తాకవాకండి. అబ్బా అక్కడ చేయి తీయండి. మీకే. వినపడ్డంలే '

'ఆకాశం మీద నగ్నంగా వున్న చంద్రుని సౌందర్యం వుంది.'

'ఇందుకా, మీరీ బొమ్మను రాస్తా?'

'సూర్యుని లేతకిరణాల వెలుగులో కొండ కోనలవున్న మంచుగడ్డల నునుపు వుంది.'

'బావుంది వెర్రి.'

'ప్రత్యూష సమయాన్ని తూర్పు కొండపై విహరిస్తోన్న ఉషః కన్య పాదాల మృదువుంది .'

'ఇహ తప్పదు. విశాఖపట్నం పిచ్చాసుపత్రికి.'

'...'

'నవ్వుతారెందుకూ? యిదిగో దాన్ని.. ముద్దువద్దు. పెట్టుకున్నారంటేనా? ఏవిటా చిలిపి చేష్టలూ.'

'తమకీ అసూయ ఎందుకూ?'

'అసూయ ఏవిటీ – అసూయ. యిది నా ఛాయ. నా ఆజ్ఞ లేకుండా దీన్ని ముద్దుపెట్టుకోడానికి మీరెవరూ?'

'నీ చిత్రం కాదిది. యిది నామను. నా సృష్టి.పద్యాలన్నీ నా సౌందర్యవర్ణనలతో నిండిపోవాలి. నన్ను పొగడడమే మీ పని. నా యవ్వనాన్ని సదా వర్ణిస్తూండడమే మీ ఉద్యోగం. నన్ను.. నన్ను పవిత్రంగా ప్రేమించడమే మీ జీవితాశయం. అప్పుడీ చిత్రం ఇప్పుడిట్లా గర్వోన్మత్తతో చూస్తూన్న యీ చిత్రం దీని గతి – అసంఖ్యానీకములైన, అసహ్యములైన ముడతలతో, తెల్లని మెరుగులేని వెంట్రుకలతో, తొట్రిలు పాదాలతో, నునుపులేని మృదువులేని కాంతిలేని అవయవాలతో,

వుండి వుండి చావాలి – నాకు, నాకు శాశ్వత యవ్వనం. శాశ్వత జీవనం. ఎప్పటికప్పుడు తిరుగులేని జీవనం. అప్పుడు.. అప్పుడూ ప్రేమిస్తారు కదూ మీరు పవిత్రంగా.'

'ముసలివాళ్ళం అయినా నీవు నన్నెంత ప్రేమిస్తావో నేను నిన్నంతే ప్రేమిస్తాను. అసలు మామూలుగా మనమనుకునే ప్రేమ, మనం పవిత్రం అని వర్ణించే ప్రేమ పడుచుతనంలోనూ లేదు, ముసలితనంలోనూ లేదు. ఎప్పుడూలేదు, ప్రపంచంలో ఎక్కడాకూడా లేదు. ప్రేమ పవిత్రం కాదు. అపవిత్రం అనే భేదం లేనేలేదు ప్రపంచంలో.'

'లేదు, లేదు, అవన్నీ నాకే ఆ అనుభవాలన్నీ నాకే. శాశ్వత యవ్వనం శాశ్వత జీవనం దాని జన్మ హక్కు. రోజురోజుకి తరుముకు వస్తూన్న మృత్యువు, భయంకరమైన మృత్యువు నా జన్మహక్కు. అప్పుడు మీరు దాన్ని వర్ణిస్తారు. దాని వర్ణనలతో మీ జీవితం నిండుతుంది. దాన్ని ముద్దుపెట్టుకుంటారు. దాని వక్షాన్ని గాఢంగా అదుముకుంటారు. నేను, నేను చచ్చినా అదివుంటుంది. లేశమయినా విచారం లేకుండా నా చావుని చూస్తుంది. మీరూ అంతే నేను లేకపోయినా మీకు లోపం లేదు మీరూ...'

'ఏవిటది అంతా మనూ చిన్న పిల్లలా మాట్లాడతావ్?"

'ఆ చావుకి ఎవరూ విలపించరు' నాకు మరణగీతిక పాడరు. నా మృత్యువు ఎవరి హృదయాన్ని తాకదు. హత్తదు. మీరు దీని యీ ముఖం యీ పాడు ముఖం చూస్తూ నాకోసం ఏడుస్తారూ? నా మరణ గీతిక నేనే పాడుకోవాలి. ఇప్పుడే పాడుకుంటాను పాడడం ఏమిటీ? ఏడుస్తాను నాకోసం నేనే ఏడవాలి. నేటి నుంచి అదే నా పని, నా విధి.'

'ఈ వేళ నీకు పిచ్చిపట్టినట్టుంది, మనూ లేకపోతే వొకరికోసం వొకరం ఏడవడం ఏవిటీ? అంత అవివేకం మరొహటిలేదు. ఎంత అవివేకం అంటే వొకరికోసం వొకరు నవ్వడం అంతా. నేను చస్తే నాకోసమని ఏడుస్తూ విరహగీతిక లాలపిస్తూ జీవితాన్నంతా దుఃఖాశ్రువులతో నింపుకోవడమేనా నీ పని? దానికన్నా నిజమైన ఆశయం వుంది మన జీవితాలకు. ఇంకా నీ ముందు సుందరతరమైన విశాల ప్రపంచం వుంది. అనుభవించు. ఆనందించు. నేనూ అంతే. నిజంగా వొక్క అశ్రుకణం రాల్చను. అశ్రుకణాలు రాలుస్తూ కూర్చోవడమే నా జీవితాశయం కాదు.'

'ఆ..ఆ.. అలా కాదు. ఆలా కానీయను. దాన్ని మీరు వర్ణించకూడదు. నేనుండగా దానికి స్థానంలేదు మీ హృదయంలో. నేను పోతే చస్తే ఎందుకు చావాలి? చస్తే ఏడ్వవలసిన విధి మీది. తప్పక దుఃఖించాలి. నాకు తెలుసు దుఃఖిస్తారు. నా చావు మీ హృదయాన్ని హత్తుతుంది ' మీ హృదయంలో నాకు స్థానం వుంటుంది నేను పోయినా.'

'బావుంది. నీవు పోయినా నీ రూపాన్ని, నీ విగ్రహాన్ని హృదయంలో పెట్టుకుని కుమిలిపోమన్నావ్, ఆరాధించమన్నావు. అది నా చేతకాదు. ఆరాధన ఉపాసన. అన్నవి వట్టి తెలివి తక్కువ మాటలు. ఎవడూ ఎవడి ప్రేయసినీ ఆరాధించడు. నా హృదయంలో దానికేమూలా స్థానంలేదు. నీకు స్థానం లేదు. ఒకరి హృదయంలో వొకరి కెప్పుడూ స్థానం వుండదు. నా హృదయాన్ని నీకివ్వలేను, నీ హృదయాన్ని నాకివ్వలేవు, మనమెంత గాఢంగా ప్రేమించామనుకున్నా

సరే ఎందుకు ఏడవడం? మృత్యువు భయంకరమైన మృత్యువా? ఎప్పుడూ కాదు. పుట్టుక ఎంత ఆనందప్రదం అయిందో, జీవితం ఎంత సుఖకరం అయిందో మృత్యువంత ఆనందప్రదమైంది, అంత సుఖకరం అయింది – ఎందుకు చావాలీ? ఎందుకు పుట్టాలి?పుట్టావు కనుక చావాలి.'

'మృత్యువంత ఆనందప్రదం అయిందీ అయితే దీనికి ఎందుకులేదు. మృత్యువు లేదు – చావు తరువాత ఏంవుంటుంది నాకు? నా యవ్వనం వుండదు. నా గులాబిపువ్వుల వక్షం వుండదు. ఏవీ వుండదు .మాట్లాడడం వుండదు. చేయడం వుండదు. వుండడం వుండదు. వుండేదల్లా లేకపోవడవే వుంటుంది. ఇదీ...'

'తరువాత ఏంవుంటే నీకెందుకు? ముందు ఏంవుందేవిటి, వెనుక వుండటానికి? పుట్టుక ముందు ఏంవుందో యోచిస్తున్నావా? చావు తరువాత ఏంవుందో ఆలోచించడానికి? ఏవుంటే మనకెందుకూ?'

'ఇది ఎప్పుడూ వుంటుంది. ఈ పాడు ముఖంతో వుంటుంది. ఎందుకుండాలి? వుండకూడదు. వుండనివ్వను. ఒక నిమిషం, ఘడియ అయినా సరే చావు...చావు.. యీసారి అయిందా పనీ.'

'.......'

COMMENTS